# ఈ పెద్దోళ్ళింతే!

"డాడీ! పెద్దాళ్ళూ..... అబద్ధాలాడొచ్చా?" తండ్రిని ప్రశ్నించాడు వినోద్.

"పెద్దాళ్ళేకాదు... ఎవరూ అబద్ధాలాడకూడదు"

"అయితే మిమ్మల్లో విషయం అడుగుతాను నిజ్జంగా నిజంచెప్తారా?"

"ఏంటి నాన్నా, ఏంటి నీ సందేహం?"

కొంత సేపు తటపటాయించి, "నిజంగా నాకు డాడీ మీరేనా?" అదిరిపడ్డాడు ఆ తండ్రి అసహ్యంగా అన్పించిన ఆ ప్రశ్నకు కోపం వచ్చినా, తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు. వినోద్ తల్లి విమల పరిస్థితిని గమనిస్తోంది. ఈ ప్రశ్న వాడికి కలగటానికి కారణం ఏంటాని ఆలోచిస్తోంది. భర్త ముఖంలో మార్పులను పరిశీలిస్తోంది.

"ఏంట్రా ఈ వెధవ ప్రశ్న? నీకేమన్నా మతికానీ పోయిందా?" కటువుగా అడిగాడు. కొడుకు అలా అడిగినందుకే తట్టుకోలేక పోతుంటే ఆ ప్రక్కనే తన సభార్డినేట్ కొడుకు, వినోద్ క్లాస్‌మేట విక్రమ్ కూడా ఉండటం అతనికి మరింత కోపకారణం అయింది.

విమల కొడుకును దగ్గరకు తీసుకొని, వీపు నిమురుతూ, "తప్పు నాన్నా! ఏంట్రా ప్రశ్న?" అని అన్నది వినోద్ బిక్కముఖం వేసాడు.

"మరి మా నాన్న పేరు అప్పయ్యట కదా?" వాడి ముఖంలో అవమానం కనిపిస్తుండగా అడిగాడు వీరేంద్రకు పరిస్థితి అర్థమయిందిప్పుడు.

"నీ కెవరు చెప్పారు?" కళ్ళెర్ర చేస్తూ ప్రశ్నించాడు.

"మాస్టారు" అన్నాడు.

"స్టుపిడ్" పళ్ళు కొరుకుతూ మెల్లగా అనుకున్నాడు పైకి మాత్రం "బా.....ఆ..... ఆదా.. అదీ మరేం లేదు నాన్నా! నేను చిన్నప్పుడు అదే మా ఇంట్లో పిల్లలు దక్కలేదనీ.. అలా పేరు పెట్టారు నేనా తరువాత ఆ పేరు నచ్చక మార్చుకున్నానలాగా" అని సర్దుకున్నాడు.

మరి మీ కంటే పెద్దవాళ్ళు పెదనాన్న అత్తావాళ్ళున్నారు కదా? " కరెంట్ షాక్ తిన్నట్టయింది వీరేంద్ర పరిస్థితి.

"వాళ్ళు మా స్వంత అన్నదమ్ముడు.. అక్క కాదు. మా పెద్దమ్మ పిల్లలు.. పిల్లల దక్కనివాళ్ళు కొన్నాళ్ళు ఎవరి పిల్లల్నయినా. ఇంట్లో ఉంచుకుంటారు. వాళ్ళింట్లో ఉంటే పిల్లలు దక్కుతారని అందరూ చెప్తే మా నాన్న వాళ్ళనింట్లో ఉంచారు. అలా ఉండిపోయారు." అనేసి అక్కడకా టాపిక్ ఆపేయాలని "వేళ్ళాడుకో" అన్నాడు.

"నిజంగానా?"

"నిజంరా"?

"మరి మార్చిన పేరివ్వచ్చు కదా! బ్యాంక్‌లో మీ పేరు వీరేంద్రనాథ్ కదా".

"మీ నాన్నమ్మంది చూసావ్. అది నా పేరలానే చెప్పేసుంటుంది". వేసవి కాలంలో క్షణక్షణానికి పెరిగిపోతున్న సూర్యతేజంలా అతనిలో టెంపరేచర్ పెరిగిపోతోంది.

'పోనీండి.. మీరు బ్యాంక్ మేనేజరు కదా. రోజు కూలీ అంటారేంటి మరి?" అడిగాడు మళ్ళీ.

కొడుకు వేసిన ప్రశ్నకు వీరేంద్ర అరికాలి మంట నెత్తికెక్కింది. హిరణ్య కశిపునిలా కొడుకును కాలితో తొక్కేయాలన్నంత కోసం వచ్చేసింది. ఈ లోగా విమల పరిస్థితి గమనించి, కొడుకును అక్కణ్ణుంచి తీసుకెత్తూ "రామ్మా, విక్రమ్" అని విక్రంని పిలిచింది.

వీరేంద్ర రుసరుసలాడుకుంటూ వీధిలోని కెళ్ళిపోయాడు. జరిగిన సంగతేటంటే...

ఈ రోజు -

స్కూల్లో ఫస్టు సిరియడ్ బెల్లయింది. క్లాస్ టీచరువచ్చారు. మరి కాసేపటికి అటెండరు కొత్త పుస్తకాలు కట్టలు పట్టుకొచ్చాడు. "పిల్లలూ! మనకి కొత్త పుస్తకాలొచ్చాయి" అని మాస్టారనగానే పిల్లల ముఖాలు విచ్చుకున్న మల్లెలయ్యాయి. పాఠశాల తెరిచి నెలరోజులయిపోతున్నా ఇంత వరకూ కొత్త పుస్తకాలు రాలేదు. ఉపాధ్యాయులు పిల్లలచేత చూచి రాతలు రాయించటం, ఎక్కాలు చెప్పించటం చేయిస్తున్నారు. పాత ఇంగ్లీషు పుస్తకాలు చదివిస్తున్నారు డిక్టేషన్లిచ్చి వీలయినంతలో చూస్తున్నారు రోజు, ఇలానే జరగటం విద్యార్థులలో నిరాశ పెరుగుతోంది ఉపాధ్యాయులూ విద్యార్థులను బుద్ధిగా కూర్చోపెట్టే మార్గం లేక ఈ పనులు చేయిస్తూ అప్పుడప్పుడు కథలు చెప్తున్నారు.

అందునుంచి పుస్తకాలు ఇస్తారనగానే అందరిలోనూ ఆనందం వికసించింది. కొత్త వస్తువులకోసం పిల్లలెంత సంబరపడతారో వాళ్ళ ముఖాలు చూస్తే అర్థం అవుతుంది. మొదట కట్టలు వచ్చినప్పటిగోల పుస్తకాలు విప్పుతోంటే సద్దుమణిగి నిశ్శబ్దమయింది. మాస్టార్లు ఒక్కొక్కరి పేర్లూ పిలుస్తున్నారు. పుస్తకాలిస్తున్నారు. వినోద్‌ని.. "మీ నాన్నగారేం చేస్తారు?" అడిగారు.

"విశాఖ గ్రామీణ బేంక్ మేనేజర్"

"ఏంటీ?"

చెప్పాడు.

"పేరు?"

చెప్పాడు

"నువ్వు కూర్చో లిస్ట్ చూసి ఇస్తా" అని తరువాత ఇంకో కుర్రాణ్ణి పిలవబోతే ఆ తరువాత నంబరు నాదండీ!" విక్రం అన్నాడు.

"నీదే కులంరా?"

మాష్టారడిగిన ప్రశ్నకు విక్రం సమాధానం చెప్పాడు. నువ్వు కూర్చో అని ఉన్న పుస్తకాలందరికీ పంచి పెడుతోంటే పుస్తుకాలందని పిల్లలు నిరాశతో కూలబడ్డారు. ఆఖరుగా ఉన్న సెట్‌ని

దులుపుతూ "వినోద్" నువ్వురా! అని పిలిచారు.

"నీ ఇంటి పేరేమిటి?"

ఇంటి పేరు చెప్పారు వాడి కళ్ళు పుస్తకాల మీదనే ఉన్నాయి. విక్రం కళ్ళనిండా నీళ్ళే వర్షాకాలం చెరువుల్లా.

మాస్టారు అడ్మిషన్ రిజిష్టరు తెచ్చి తిరగేస్తూ "ఒరే! అబ్బాయి. చంపావు కదరా మీ నాన్న పేరు అప్పయ్య కూలి పని చేస్తున్నట్లుంది." అని వినోద్ నెత్తిమీద నో మొట్టు పెట్టాడు.

"కాదండీ వినోద్ వాళ్ళ డాడీ విశాఖ గ్రామీణ బాంక్ మేనేజరు. మా డాడీ కూడా అందులోనే కేషియరు" విక్రం అన్నాడు.

అటెండరు వచ్చి మాస్టారి చెవులో రహస్యంగా ఏదో చెప్పాడు.

"అదా సంగతి చంపాడు కదరా వీడు!" అని నవ్వేసి వినోద్‌కి పుస్తకాల సెట్ ఇచ్చారు.

"సార్ నాకివ్వరా?" విక్రం అడిగాడు.

"పుస్తకాలు తక్కువ వచ్చాయి ఇవి కేవలం పేద విద్యార్థులకే మళ్ళీ వస్తాయి. అప్పుడందరికీ ఇస్తాం" సర్ది చెప్పారు.

పుస్తకాలు అందుకున్న పిల్లలు వాటిని ఆనందంగా తిరగేస్తున్నారు. పుస్తకాలు అందుకోలేని విద్యార్థులు వెలగని మతాబాలయ్యారు. పొంగుతున్న పాలమీద నీళ్ళు చల్లినట్లయింది. వాళ్ళలో ఆనందం, పుస్తకాలందుకున్న పిల్లలమీద వాళ్ళకి అసూయా, కోపం పెరిగిపోయాయి.

"సార్ మేమూ పేదవాళ్ళమేసార్. మానాన్న కిరాణా షాపులో గుమస్తా మానాన్నకి అయిదొందలే జీతం వినోద్ వాళ్ళ నాన్న ఆఫీసరు కదా, పేదవాడెలా అవుతాడండీ!" ఓ పిల్లాడు నిలబడి అడిగాడు.

కులం ప్రసక్తి తేవటం ఇష్టం లేక మాస్టారలా అన్నందుకు అతనికిలాటి సమస్య వస్తుందనుకోలేదు. తనని పేదవానిగా ఎత్తి చూపటం వినోద్‌కి నచ్చలేదు.

"నిజం సార్ మాకు మోటర్ బైకుంది మేడ వుంది కలర్ టి.వి ఉంది. ఫ్రిజ్ ఉంది. మేం పేదవాళ్ళం ఎట్లా అవుతాం సార్!" పౌరుషంగా అన్నాడు వినోద్.

"మీరు కూర్చోండి గొడవ చేయకండి కొద్ది రోజుల్లో మళ్ళీ పుస్తకాలొస్తాయి. అందరికీ ఇస్తామన్నాం కదా!" ఆఖరి అస్త్రం ప్రయోగించటంతో వాళ్ళు భయంతో మరి లేవలేదు.

ఆ తరువాత బడివదిలారు.

విక్రం మాత్రం నిరుత్సాహంగానే ఉన్నాడు. అది గమనించిన వినోద్ "విక్రం! ఈ పుస్తకాలు నువ్వే తీసుకో మళ్ళీ వచ్చినపుడు నేను తీసుకుంటా" అన్నాడు.

" వద్దు నువ్వే ఉంచు. కాపోతే! కలిసి చదూకుందాం!" అన్నాడు విక్రం.

అయితే ' తన తండ్రి 'అప్పయ్యే' అనీ, రోజు కూలీయేనని అంటారేంటి మాస్టారు?

తోవలో అటెండర్ కనిపిస్తే ఉండబట్టలేక అడిగాడు వాడు "మీ డాడీ జీతం వేసి, మీ డాడీ పేరే రాస్తే - నీకిప్పుడు పుస్తకాలే కాదు. నువ్వు పెద్దయితే నీకే రిజర్వేషనూ వర్తించదు. అందరితో నువ్వు పోటీ పడాలి!'' అన్నాడు.

"పడతాను నేనేం పోటీ పళ్ళేనా? చదవలేనా?'' అడిగాడు. వినోద్.

వినోద్ చిన్న మనసు గాయపడింది. అలా అబద్ధం అడ్డం సుతరామూ ఇష్టపళ్ళేదు. అబద్ధాలు చెప్పకుడని మాస్టార్లూ చెప్తారు తల్లిదండ్రీ చెపుతారు పుస్తకాల్లోనూ అలానే ఉంది.

"మరిలా అబద్ధాలు చెప్పొచ్చా?''

అదే వాడిలో సమాధానం దొరకని ప్రశ్న అదే తల్లినీ అడిగాడే. ఆమెకూ సమాధానం దొరకలేదు. ఆ తరువాత వినోద్ విక్రంలు విక్రం - వాళ్ళింటికెళ్ళారు.

"అమ్మా! వినోద్ వాళ్ళు పేదవాళ్ళా మనం పేదవాళ్ళమా?'' విక్రం తల్లిని అడిగాడు.

"ఎందుకొచ్చింది నీకా సందేహం?'' తిరిగి ప్రశ్నించింది తల్లి "స్కూల్లో వినోద్ పేదవాడని పుస్తకాలు ఫ్రీగా ఇచ్చారు. మనం వీళ్ళకంటే ధనికులమంట'' అన్నాడు.

"నిజనికి మేమే డబ్బున్న వాళ్ళం కదాంటీ?''

విక్రం తల్లి ఇరకాటంలో పడింది. ఏం చెప్పాలో ఆ మధ్య తరగతి మగువకు తెలీక "ఉద్యోగ రీత్యా వాళ్ళే అయినా, కులంలో వాళ్ళు మనకంటే తక్కువ'' అంది. తల్లి ఏదో చెప్పింది అది వాడికి నచ్చలేదు.

"మరి శ్రీకృష్ణుడు గొల్లవాడు కదా, బ్రహ్మలెందుకు పూజిస్తారు?'' విక్రం అడిగాడు.

వీళ్ళ ప్రశ్నలేక్కడికిపోతాయోనన్నభయం వేసిందా తల్లికి. "పోయిఆడుకోండి! వెధవ ప్రశ్నయ్యకండి!'' కసురుకుంది ముఖ్యంగా వినోద్ ఎంగిలి చేసిన మామిడి పండు విక్రం తినటం చూసి రెండు అంటించింది. "మరి శబరి ఎంగిలి శ్రీరాముడు తిన్నాడని నువ్వుగొప్పగా చెప్పావు గానీ మా ఫ్రెండు ఎంగిలి నేను తినటం తప్పా?'' అని ఎదురు జవాబు చెప్పటం చేతనే కొట్టింది.

మళ్ళీ ప్రశ్నిస్తే తల్లి చెయ్యి చేసుకుంటుందని అక్కడనుండి జారుకున్నాడు వినోద్ అతన్నను సరించాడు.

"అసలు ఈ పెద్దాళ్ళే ప్రశ్నకూ సమాధానం చెప్పరు? స్కూల్లో మాస్టార్లు అంతే! ప్రశ్నలడగమంటారు. అడిగితే కసురుకుంటారు. మరి వీళ్ళు జవాబులు చెప్పటంతెలీకే కసురుకుంటారో, ఏమో అర్థం కాదు'' అన్నాడు విక్రమ్.

"నిజం.. నాకూ అలానే అనిపిస్తుంది'' అన్నాడు. కానీ - ఈ ప్రశ్నలకు సరైన జవాబు ఎవరు చెప్పగలరు?'' అన్నదే వాళ్ళ శేషప్రశ్న!

(బరంపురం ఆంధ్రవిజ్ఞాన మిత్రమండలి నిర్వహించిన కధలపోటీలో ద్వితీయ బహుమతిపొంది 'తెలుగు విద్యార్థి' లో వచ్చినది.)

❋ ❋ ❋ ❋